సాక్షి మెదక్

శుక్రవారం : 17 : నవంబర్ : 2023



అన్నీ తానై..

బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా చెమటోడ్చుస్తున్నారు మంత్రి హరీశ్‌రావు. సుమారు 16 గంటల పాటు 12 కార్యక్రమాలకు హాజరయ్యారు.

వివరాలు 10లో ▸



బీఆర్ఎస్ పాలనలో..

బీఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి జరిగిందని. మరోసారి ఆ పార్టీకి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కోరారు.

వివరాలు 10లో ▸



పుస్తక పఠనంతో మేధాశక్తి

పుస్తక పఠనంతో మేధాశక్తి పెరుగుతుందని తునికి మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ శివప్రసాద్ అన్నారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ బూత్‌లను గురువారం మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు బూత్‌లలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. అవసరమైన చోట మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. అనంతరం మున్సిపల్ ఏఈతో పర్యవేక్షించారు. అన్ని బూత్‌లలో మూత్రశాలలు, తాగునీటి వసతి కల్పిస్తామని ఉమాదేవి తెలిపారు.

అంతర్జాతీయ కరాటేలో మెదక్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు అందుకున్న విద్యార్థులతో మాస్టర్ నగేశ్, కోచ్ దినకర్

మెదక్ మున్సిపాలిటీ: మూడో అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు రెంజుకి షోటోకాన్ వ్యవస్థాపకుడు, కరాటే మాస్టర్ నగేశ్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారికి గుల్షన్‌క్లబ్‌లో మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేశవ షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో 3వ అంతర్జాతీయ స్థాయి ఆన్‌లైన్ కటాస్ ఛాంపియన్‌షిప్స్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలకు ఇండియాతో పాటు భూటాన్, జపాన్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్, బాంగ్లాదేశ్‌తో పాటు సుమారు 30 దేశాలు నుంచి మొత్తం 3వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, పోటీలలో రెంజుకి షోటోకాన్ మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు నగేశ్ తెలిపారు. కార్యక్రమంలో కరాటే కోచ్ దినకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖనంలో రాణించిన విద్యార్థిని



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

మనోహరాబాద్(తూప్రాన్): హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయిలో జరిగిన చిత్రలేఖన పోటీలలో మనోహరాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అరీబా ఉత్తమ ప్రతిభ కనబర్చింది. గురువారం జరిగిన పోటీలలో తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆమె ఖనమ్ కన్సోలేషన్ బహుమతితో పాటు, రూ.9500 పొందినట్టు హెచ్‌ఎం రెహానా సుల్తానా తెలిపారు. అరీబాను చిత్రలేఖన ఉపాధ్యాయుడు బ్రహ్మచారి పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య



మాట్లాడుతున్న సంగయ్య

పాపన్నపేట(మెదక్): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరీ చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య డిమాండ్ చేశారు. మండలంలోని యూసుఫ్‌పేట్, పాపన్నపేట, నార్సింగ్, చీకోడ్, లింగాయిపల్లి, కొడపాక, నాగ్సాన్‌పల్లి గ్రామాల్లోని పాఠశాలలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగిపోయిన ప్రమోషన్లు, పెండింగ్ బిల్లులు, బదిలీలను చేపట్టాలన్నారు. ఉపాధ్యాయుల లోన్‌లు, సరెండర్ బిల్లులను మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ హీరాలాల్, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, మండల శాఖ అధ్యక్షుడు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ

వట్‌పల్లి (అందోల్): జోగిపేటలో శనివారం నిర్వహించే ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ పిలుపునిచ్చారు. గురువారం అందోల్ మండల పరిధిలోని మసానిపల్లి గ్రామంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని 9 మండలాల ముదిరాజ్ బంధువులు పెద్ద ఎత్తున ఈ సభకు హాజరు కావాలన్నారు.





గురువారం నర్సాపూర్ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సభకు హాజరైన ప్రజలు

నర్సాపూర్‌కు కాళేశ్వరం జలాలు

- కౌడిపల్లికి డిగ్రీ కాలేజీ.. నర్సాపూర్‌కు ఐటీఐ
- మండల కేంద్రంగా రంగంపేట
- దౌల్తాబాద్ కాసాల పంచాయతీలను కలిపి మున్సిపాలిటీ
- రోజుకు 24గంటల కరెంటు కావాలన్నా సునీత గెలవాలి
- బీఆర్ఎస్ ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

నర్సాపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నర్సాపూర్ నియోజకవర్గానికి అనేక వరాలు ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గానికి త్వరలోనే కాళేశ్వరం జలాలు అందిస్తామని, పిల్లుట్ల కాల్వ పనులు కొనసాగుతున్నాయని, పూర్తి కాగానే తాను వచ్చి కొబ్బరికాయ కొడుతానని చెప్పారు. నర్సాపూర్ నియోజకవర్గం వజ్రం తునక అయితదన్నారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కోరిక మేరకు కౌడిపల్లికి డిగ్రీ కాలేజీని మంజూరు చేశానన్నారు. మంజీరా, హల్దీవాగులపై చెక్ డ్యాంలు నిర్మించ వద్దని కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధం పెట్టిందని, అయితే.. తాము నిషేధం ఎత్తివేసి వాటిపై అవసరమైన చోట చెక్ డ్యాంలు నిర్మించామని, దీంతో అవి జీవనదులుగా మారాయని తెలిపారు. చెక్‌డ్యాంల కింద వేసవిలో సైతం రైతులు బాగా పంటలు పండిస్తున్నారని చెప్పారు. రోజుకు 24గంటల కరెంటు కావాలన్నా, మంజీరా, హల్దీ వాగుల కింద నిర్మించిన చెక్ డ్యాంలను నీటితో నింపాలన్న బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే నీళ్లు వస్తాయని సీఎం పేర్కొన్నారు. కోమటిబండ నుంచి ఇంటింటికి నల్లా నీళ్లు ఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డిల అభ్యర్థన మేరకు నర్సాపూర్‌కు ఐటీఐ మంజూరు చేస్తానని, రంగంపేటను మండల కేంద్రం చేస్తామని, దౌల్తాబాద్ కాసాల గ్రామ పంచాయతీలను కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలని సీఎం ఈ సందర్భంగా ముస్లింలను కోరారు. మైనార్టీ గురుకులాలను డిగ్రీ కాలేజీలుగా మార్చనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో అన్ని మతాలకు తమ ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని వివరించారు.

మదన్‌రెడ్డికి గౌరవప్రదమైన పదవి

సునీతారెడ్డికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినప్పటికీ తన చిరకాల మిత్రుడు, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఏ పదవీ లేకుండా ఖాళీగా ఉండడని, ఆయనను గౌరవ ప్రదమైన పదవిలో ఉండే విధంగా చూస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. మదన్‌రెడ్డి, సునీతారెడ్డిల సహకారంతో నర్సాపూర్ బాగా అభివృద్ధి చెందుతోందని, సునీతారెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ నర్సాపూర్ గులాబీ జెండా అడ్డా అని చెప్పారు. కాంగ్రెస్ , బీజేపీలను నమ్మొద్దని ప్రజలను కోరారు. గాలి అనిల్‌కుమార్ పాత వాడేనని సొంతగూటికి వచ్చారన్నారు.

సునీతమ్మను గెలిపించే బాధ్యత మనందరిది : ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

ముఖ్యమంత్రి కేసీఆర్ శిష్యుడిగా, ముఖ్య అనుచరుడిగా తనకు ముద్ర పడిందని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి గెలిపించే బాధ్యత తనతో పాటు ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తపై ఉందన్నారు. పదేళ్ల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. కార్యకర్తలు, నాయకుల మధ్య ఎలాంటి మనస్పర్ధలు లేకుండా గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాగా, సభలో జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, ఎమ్మెల్సీలు రఘోత్తంరెడ్డి, వెంకట్రాంరెడ్డి, కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నాయకులు చంద్రాగౌడ్, మన్సూర్, గొర్రె వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్‌లో చేరిన గాలి అనిల్‌కుమార్, ఎంపీపీ జ్యోతి, శ్రీకాంత్‌గౌడ్, మ్యాడం బాలకృష్ణ పాల్గొన్నారు.

కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శం: సునీత

నర్సాపూర్ రూరల్: శివ్వంపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి అన్నారు. మంజీరా, హల్దీ వాగులపై 14 చెక్‌డ్యామ్‌లు నిర్మించి సస్యశ్యామలం చేశారన్నారు. కాళేశ్వరం జలాలను హల్దీవాగులోకి వదిలి పంటలను ఎండకుండా చేసిన మంత్రి హరీశ్‌రావును కొనియాడారు. నియోజకవర్గంలో సాగు చేసుకుంటున్న లావణి, పోడు భూములకు హక్కులు కల్పించాలని సీఎంని కోరారు. నర్సాపూర్‌కు మరో 7 వేల ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు. కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన గాలి అనిల్‌కుమార్, సింగాయిపల్లి గోపీలను ఈ సందర్భంగా అభినందించారు. సీఎం ఆశీర్వాదం, మదన్‌రెడ్డి సహకారంతో తనకు ఓటువేసి గెలిపించాలని సునీతారెడ్డి ప్రజలను కోరారు.

అభ్యర్థులు సహకరించాలి

జిల్లా సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్

మెదక్ కలెక్టరేట్: బరిలో నిలిచిన అభ్యర్థులు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని జిల్లా సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నాయకులు, పోటీచేసే అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని, నియమావళిని తప్పక పాటించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తుందని తెలిపారు. అభ్యర్థులు కొత్త బ్యాంక్ అకౌంట్ తీసుకోవాలని, ఆ అకౌంట్ నుంచి రోజుకు పదివేల కంటే ఎక్కువ డ్రా చేసుకోవద్దని జిల్లా వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఖర్చుల విలువలు ఈసీఐ ధరల సూచి విలువల ప్రకారం వర్తిస్తాయని చెప్పారు.

అన్నీ అభ్యర్థుల ఖాతాలోనే..

ఎన్నికలలో దాతలుచేసే సహాయ సహకారాలు, ఎన్నికల ఖర్చులు, అభ్యర్థుల ఖాతాలో జమ అవుతాయని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా తెలిపారు. ఈ నెల 18న మెదక్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో, నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీలలో రెండో రాండమైజేషన్ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. డమ్మీ బ్యాలెట్ తయారు చేసుకునే వారు వారి గుర్తులు మాత్రమే డమ్మీ బ్యాలెట్‌లో పెట్టుకోవాలని, ఏదైనా సమస్యలుంటే సీ విజిల్, 1950లో ఫిర్యాదు చేయాలని చెప్పారు.


ప్రచారాన్ని అడ్డుకుంటే ఫిర్యాదు చేయండి

ఎన్నికలలో అభ్యర్థుల ప్రచారాన్ని ఎవరైనా అడ్డుకున్నా, ఘర్షణలు జరిగినా 100కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీంలలో ఉండే పోలీసు అధికారులు వాటిని పరిష్కరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, ఎన్నికల నోడల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, వివిధ పార్టీల అభ్యర్థులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3.70లక్షలు పట్టివేత

కోలపల్లి టోల్ ప్లాజా వద్ద తనిఖీలు

పెద్దశంకరంపేట (మెదక్): ఎలాంటి అనుమతి లేకుండా కార్‌లో తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని కోలపల్లి పాత టోల్‌ప్లాజా వద్ద గురువారం నిర్వహించిన తనిఖీలలో ఎలాంటి అనుమతులు లేకుండా కారులో తరలిస్తున్న రూ.3.70 లక్షలు పట్టుకున్నామని ఏఎస్ఐ విట్టల్ తెలిపారు. నాందేడ్ వైపు నుంచి హైదరాబాదు వెళుతున్న మహారాష్ట్రకు చెందిన వాహనం నుంచి ఆ నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట సిబ్బంది రఘునాథ్, రాములు ఉన్నారు.



కోలపల్లి టోల్ ప్లాజా వద్ద నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు

యువ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొనాలి

- వందశాతం ఓటింగ్ లక్ష్యం
- మెదక్ ఐడీఓసీలో సెల్ఫీ పాయింట్
- జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని యువ ఓటర్లు ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా పిలుపునిచ్చారు. గురువారం మెదక్ ఇంటి గ్రేటెడ్ ఆఫీసర్స్ కాంప్లెక్స్(ఐడీఓసీ)లో యువ ఓటర్లను ఆకర్షించేందుకు సెల్ఫీ పాయింట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్, వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్, పోలీస్ పరిశీలకుడు సంతోష్ కుమార్ తుకారాం, జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శినితో కలిసి కరపత్రం అవిష్కరించారు. ఎన్నికలకు సంబంధించిన ఓటర్ నమోదు, ఎథిక్ ఓటింగ్, సీ విజిల్, టోల్ ఫ్రీ నెం1950 వంటి వాటిపై రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో వివిధ శాఖలకు చెందిన 50 టీమ్‌లు పాల్గొన్నాయి. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా మాట్లాడుతూ సాధారణ ఎన్నికలలో భాగంగా స్వీప్ ఆధ్వర్యంలో జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో 100 శాతం ఓటింగ్ లక్ష్యంగా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. 'నేను కచ్చితంగా గా ఓటు వేస్తాను' అనే నినాదంతో ప్రజలందరూ ఓటింగ్‌లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రంగోలి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం యువ ఓటర్లు, మహిళలు, ఉద్యోగులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పద్మశ్రీ, బ్రహ్మాజీ, రాజిరెడ్డి, విజయలక్ష్మి, కరుణ, యూనస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సీ విజిల్ కరపత్రాలు తప్పనిసరి

ఓటరు సమాచార స్లిప్‌తోపాటు సీ విజిల్ కరపత్రాలు ప్రతి ఓటరుకు తప్పనిసరిగా అందాలని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా ఆదేశించారు. గురువారం మెదక్‌లోని దాయర వీధిలో ఓటర్ సమాచార స్లిప్పుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పలువురికి స్లిప్పులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పోలింగ్‌కు ఇంకా 13 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని బీఎల్‌ఓలు, బీఎల్ఓ సూపర్ వైజర్లు ఇంటింటికీ వెళ్లి ఓటర్ సమాచార స్లిప్పులు అందజేయాలని ఆదేశించారు. ఈనెల 22 వరకు రోజు వారీగా 200 ఓటర్ సమాచార స్లిప్పులు పంపిణీ చేయాలని, అప్పుడే పంపిణీ కార్యక్రమం త్వరితగతిన పూర్తవుతుందన్నారు. ఓటర్ స్లిప్‌తో పాటు ఓటర్ గైడ్, సీ విజిల్ కరపత్రాలు ప్రతి ఓటర్‌కు అందజేయాలని, అలాగే సీ విజిల్ యాప్, టోల్‌ఫ్రీ నెం.1950పై అవగాహన కల్పించాలని సూచించారు. దీనిని సెక్టార్ అధికారులు కచ్చితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ విషయంపై రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లకు సమాచారం అందించాలని తెలిపారు. దాయర పోలింగ్ కేంద్రం పరిధిలో మొత్తం 1343 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 620, స్త్రీలు 723, మరణించిన వారు ఏడుగురు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, బీఎల్ఓ మాధవి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



యువ ఓటర్లు, అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

అభ్యర్థులకు గుర్తులు

అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల సంఘం గుర్తులను కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి(కారు), కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్(చేయి), బీఎస్పీ అభ్యర్థి అంసాన్‌పల్లి లక్ష్మి(ఏనుగు), బీజేపీ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్(కమలం), స్వతంత్ర అభ్యర్థి వనం పుల్లయ్య(కెమెరా), ఇండియన్ బీసీ పార్స్ పార్టీ అభ్యర్థి బొద్దు దేవదాస్(గాజుగ్లాసు), భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి వనపర్తి రోహిత్(గన్ కిసాన్)లను కేటాయించినట్లు తెలిపారు. అలాగే స్వతంత్ర అభ్యర్థులైన ఏ.కుమార్(చపాతీరోలర్), కొమ్మాట స్వామి(పండ్లబుట్ట), గడ్డమీది నాగరాజుగౌడ్(ఎయిర్ కండిషనర్), పట్లోళ్ల బాపురెడ్డి(ఉంగరం), లస్మగల్ల పద్మ(జోలీ), లంబాడి తార్య(బ్యాట్)లను కేటాయించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటే

ఎంపీ బండి సంజయ్

రామచంద్రాపురం/పటాన్‌చెరు: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, ప్రజా సమస్యలపై, నిరుద్యోగ ఉద్యోగాల కోసం పోరాటం చేస్తే తనపై, తమ పార్టీ కార్యకర్తలపై కేసీఆర్ ప్రభుత్వం అనేక కేసులు పెట్టిందని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రామచంద్రాపురం పట్టణంలో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ పార్టీ గెలువద్దని ఈ రెండు పార్టీలు కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై, ఉద్యోగాల కోసం పోరాటం చేస్తే తనపై, తమ పార్టీ కార్యకర్తలపై కేసీఆర్ ప్రభుత్వం అనేక కేసులు పెట్టిందని తెలిపారు. ఈ రెండు పార్టీలు ఒక వర్గానికి చెందిన ఓట్ల కోసమే పోటీ పడుతుందని తెలిపారు. హిందూ సమాజం ఐక్యమే బీజేపీ పార్టీకు మద్దతు ఇవ్వాలని కోరారు. అభివృద్ధి బీజేపీ పార్టీతోనే సాధ్యమని తెలిపారు. పేదల రాజ్యం, రామరాజ్యం రావాలంటే బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తాము గెలిచిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి నందీశ్వర్ గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అలాగే, పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి గ్రౌండ్స్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు ఉన్న కారణంగా కుహనా లౌకిక వాదులు, హిందూ ప్రజలను విస్మరిస్తున్నారని తెలిపారు. ప్రచారంలో మసీదులోకి వెళ్లి తలపై టోపీలు పెట్టుకొని ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధవి, పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి సంజయ్

మూల మహోత్సవ వైభవం

వర్గల్(గజ్వేల్): చదువుల తల్లి నెలవు వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రం గురువారం మూల మహోత్సవ వైభవంతో అలరారింది. జన్మనక్షత్ర వేళ తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి పర్యవేక్షణలో అమ్మవారి మూలవిగ్రహానికి విశేష పంచామృతాభిషేకం జరిపారు. సర్వాలంకార శోభితులైన అమ్మవారికి భక్తజన సామూహిక లక్షపుష్పార్చన, లలితాపారాయణం, సప్తశతీ, చండీ పారాయణం , చండీ హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. కుంకుమార్చన చేశారు. వేడుకలో భక్తులు పాల్గొని తరించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వర్గల్ సరస్వతి అమ్మవారు



సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్


కేసీఆర్‌తో హరీశ్‌రావు ముచ్చట

హరీశ్ హాజరై.. అన్నీ తానై

- 16 గంటలు.. 12 కార్యక్రమాలు..
- రోడ్‌షోలు, ఆత్మీయ సమ్మేళనాలతో బిజీబిజీ
- చేరికల కోసం కాంగ్రెస్, బీజేపీ నేతల ఇళ్లకు..
- మద్దతు కూడగట్టేందుకు సీపీఎం కార్యాలయానికి..
- బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చెమటోడుస్తున్న మంత్రి


గిరిజన సదస్సులో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా చెమటోడుస్తున్నారు మంత్రి హరీశ్‌రావు. గురువారం జిల్లాలో బిజీబిజీగా గడిపారు. బుధవారం రాత్రి సంగారెడ్డిలోనే నిద్రించిన ఆయన ఉదయం ఏడు గంటల నుంచే తన దినచర్యను ప్రారంభించారు. రాత్రి పది గంటల వరకు సుమారు 16 గంటల పాటు వివిధ కార్యక్రమాలు, ప్రచార సభలతో క్షణం తీరిక లేకుండా గడిపారు. పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు బీఆర్‌ఎస్‌లో చేరేలా అన్నీ తానై వ్యవహరించారు.

ముఖ్యనేతల నివాసాలకు..

కాంగ్రెస్, బీజేపీలకు చెందిన రాష్ట్ర స్థాయి, జిల్లా నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరేలా మంత్రి హరీశ్‌రావు కీలకంగా వ్యవహరించారు. గురువారం ఉదయమే టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మెదక్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి గాలి అనిల్ నివాసానికి వెళ్లిన పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సంగారెడ్డి టికెట్ ఆశించి భంగపడిన రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే నివాసానికి వెళ్లిన మంత్రి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు.

సీపీఎం కార్యాలయానికి స్వయంగా వెళ్లి..

జిల్లాలో సీపీఎం పార్టీ మద్దతు కూడగట్టేందుకు హరీశ్‌రావు స్వయంగా సంగారెడ్డిలోని ఆ పార్టీ కార్యాలయానికి వెళ్లారు. స్థానిక బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతప్రభాకర్‌తో కలిసి సీపీఎం నేతలతో చర్చలు జరిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో మాత్రమే సీపీఎం పోటీ చేస్తోంది. మిగిలిన చోట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని ఆ పార్టీ నేతలను కోరారు.

రోడ్ షోలు, కులసంఘాల సమ్మేళనాలు..

ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా హరీశ్‌రావు పలు చోట్ల రోడ్‌షోలు, కుల సంఘాల నేతల ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం హద్నూర్‌లో జరిగిన ప్రజాఆశీర్వాద సభలో పాల్గొన్న మంత్రి కర్నాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఐదు నెలల్లోనే విఫలమైన తీరును వివరించారు. ఎస్టీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మంత్రి గిరిజనుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఎరుకల కులస్తులతోనూ ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఈనెల 23న జహీరాబాద్‌లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడి నుంచి నర్సాపూర్‌లో జరిగిన సీఎం కేసీఆర్ బహిరంగసభకు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం పటాన్‌చెరులోని ఇస్నాపూర్ సభకు చేరుకొని సభనుద్దేశించి మాట్లాడారు. ఇలా గురువారం రోజంతా సంగారెడ్డి జిల్లాలోనే గడిపారు.

మల్లేశ్‌తో ముచ్చటించిన మంత్రి..

హద్నూర్‌లో పర్యటించిన హరీశ్‌రావు కర్నాటక రాష్ట్రంతో బంధుత్వం ఉన్న మల్లేశ్ అనే వ్యక్తితో ముచ్చటించారు. స్థానికంగా ఓ ఫ్యాక్టరీలో ఉద్యోగిగా పని చేస్తున్న మల్లేశ్ కర్నాటకలోని పరిస్థితులను మంత్రితో తెలిపారు.

ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్


సభకు తరలి వస్తున్న జనం

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నర్సాపూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్ అయ్యింది. సీఎం కేసీఆర్ ప్రసంగం గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలి రావడంతో సభాప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆ పరిసరాలు ఫ్లెక్సీలు, పార్టీ జెండాలతో గులాబీమయంగా మారాయి. సభలో కాంగ్రెస్‌పై కేసీఆర్ నిప్పులు చెరిగారు.


కళాకారుల నృత్య ప్రదర్శన

బీఆర్‌ఎస్‌లో చేరికలు

నర్సాపూర్ రూరల్, శివ్వంపేట: ప్రజా ఆశీర్వాద సభలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, నర్సాపూర్ ఎంపీపీ జ్యోతి, మెదక్‌కు చెందిన పీసీసీ నేత మ్యాడం బాలకృష్ణ, అజ్మత్ అలీ, సురేష్‌నాయక్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు చేరారు. అలాగే.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి, కౌన్సిలర్ సునీత, బాల్‌రెడ్డి, సంగారెడ్డి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రాజేశ్ దేశ్‌పాండే, పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ గడిల శ్రీకాంత్‌లకు సీఎం కేసీఆర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.


గాలి అనిల్ కుమార్‌కు పార్టీ కండువా కప్పుతున్న సీఎం కేసీఆర్


సింగాయిపల్లి గోపి..


రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే..


మ్యాడం బాలకృష్ణ..

సీఎం సభ హైలైట్స్

నర్సాపూర్ రూరల్/ శివ్వంపేట: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నర్సాపూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి మాట్లాడారు.

- మంత్రి హరీశ్‌రావు 5.07 నిమిషాలకు వేదిక పైకి చేరుకుని మాట్లాడారు
- సీఎం కేసీఆర్ హెలీకాప్టర్ 5.32 నిమిషాలకు సభాస్థలం వద్ద ల్యాండ్ అయింది
- 5.45 నిమిషాలకు సీఎం కేసీఆర్ వేదికపైకి వచ్చి అభివాదం చేశారు
- 5.58 నిమిషాలకు ప్రసంగం ప్రారంభించి 6.20 నిమిషాలకు ముగించారు
- ప్రముఖ కళాకారుడు ఏపూరి సోమన్న పాటలతో ఉత్తేజపరిచారు
- కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు భారీ బందోబస్తు నిర్వహించారు.
- నర్సాపూర్ చౌరస్తా నుంచి సభాస్థలం వరకు రెండు కిలో మీటర్ల రోడ్డు కిక్కిరిసింది
- సభ ముగిసిన అనంతరం సీఎం కేసీఆర్ రోడ్డు మార్గాన ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌కు వెళ్లారు



అవ్వా.. నీ ఓటు కారుకే..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని చెలుకలపల్లిలో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా మహిళా విభాగం నాయకురాలు రాజశ్రీ,, ఏఎంసీ చైర్మన్ కొండం వనిత, సరోజన, కనకవ్వలు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వృద్ధురాలిని బుజ్జగిస్తూ.. కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు.



డప్పు కొడుతూ.. ఇస్త్రీ చేస్తూ..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. గురువారం పట్టణంలోని 2వ వార్డులో స్థానిక బీఆర్‌ఎస్ కౌన్సిలర్ నాయిని చంద్రం డప్పు కొడుతూ.. ఇస్త్రీ చేస్తూ హరీశ్‌రావుకే ఓటు వేయాలని అభ్యర్థించారు.



కూరగాయలు అమ్ముతూ..

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి ఓ దుకాణం వద్ద కూరగాయలు విక్రయిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు బాగయ్య, ఉమేష్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి


ఓ హోటల్‌లో చాయ్ చేస్తున్న క్రాంతికిరణ్

ఎమ్మెల్యే క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్): బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి జరిగిందని, మరోసారి ఆ పార్టీకి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఓటర్లను కోరారు. మండలంలోని మోరట్గా, మామిడిపల్లి, కర్చల్, నాగన్‌పల్లి, రాయిపల్లి తదితర గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి, డప్పులతో స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయా గ్రామాలకు తన హయాంలో కేటాయించి నిధులు, చేసిన అభివృద్ధి, ఎన్నికల మేనిఫెస్టో గురించి ఓటర్లకు వివరించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మూడు గంటల కరెంటు సరఫరాతో ఇబ్బందులు తప్పవని ఆరోపించారు. 40 ఏళ్లు పాలించి గ్రామాలను, పేదలను పట్టించుకోని వారి మాయమాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. ఓ హోటల్‌లో ఆయన చాయ్ చేసి, డప్పు కొట్టి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో బసవరాజ్ పాటిల్, శంకర్, సిద్దప్ప పాటిల్, విఠల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో కన్నీళ్లే..

ములుగు(గజ్వేల్): కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో కన్నీళ్లే మిగలడంతో పాటు బీఆర్‌ఎస్ పునర్నిర్మిస్తుందని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. ములుగు మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(బహిలంపూర్)లో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన కేసీఆర్ ప్రసంగపాఠం 'కాంగ్రెస్ చేసిందేంటీ?' అనే పుస్తకాన్ని గురువారం రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ములుగు మండల ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ పిర్యాల రవీందర్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ యూత్‌వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాష, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలను ఓటు బ్యాంకుగా చూసారే తప్ప తెలంగాణను మానవ సంపదగా మార్చలేదని వారు ధ్వజమెత్తారు.

పని చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలి

కొండపాక(గజ్వేల్): పని చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మండల ఇన్‌చార్జి లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. కుకునూరుపల్లి మండలంలోని లకుడారం, కుకునూరుపల్లి, బొబ్బాయిపల్లి గ్రామాల్లో గురువారం బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల బాగు కోసం సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని గమనించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఆచరణకు సాధ్యం కానీ హామీలను ఇస్తూ ఓట్ల కోసం కొత్త బిచ్చగాళ్ళ మాదిరిగా గ్రామాల్లో తిరుగుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవి రవీందర్, కోల సద్గుణ, పొల్కంపల్లి నరేందర్, పిస్క అమరేందర్, కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గడీల పాలనలో తీరని అన్యాయం

పదేళ్లలో పది ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు..

- బీజేపీ దుబ్బాక అభ్యర్థి రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కనీసం పది ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, కేసీఆర్ ఇంట్లో మాత్రం అందరికీ పదవులు వచ్చాయని దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు బీజేపీలో చేరారు. అలాగే దుబ్బాక నియోజకవర్గంలోని నార్సింగ్ మండలంలోని నర్సంపల్లి, పెద్దతండా, వల్లభాపూర్, వల్లూర్, భీంరావుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ గడీల పాలనలో ఉద్యోగాలు రాక యువతకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కనీసం ఉద్యోగ పరీక్ష నిర్వహించలేని పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం ఉందన్నారు. పరీక్ష పేపర్ల లీకేజీలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందన్న సంగతి ప్రజలందరికీ తెలిసిందేనన్నారు.

దుబ్బాకలో హరీశ్ పెత్తనమేంటి?

దుబ్బాక నియోజకవర్గం పై హరీశ్‌రావు పెత్తనమేంటని, కేవలం ఎన్నికలప్పుడే వచ్చి సిద్దిపేట, దుబ్బాక నాకు రెండు కళ్లు అంటూ.. ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తే ప్రజలు నమ్మరని రఘునందన్‌రావు అన్నారు. హరీశ్ మాటలు, నాటకాలు సిద్దిపేటలో నడుస్తాయని, దుబ్బాకలో కుదరవని ఎద్దేవా చేశారు. ఉన్న నిధులన్నీ సిద్దిపేటకే తరలించుకుపోయి దుబ్బాక నియోజకవర్గానికి హరీశ్ తీరని అన్యాయం చేశాడని ఆరోపించారు. ట్రబుల్ షూటర్ హరీశ్‌రావుకు గత ఉప ఎన్నికల్లో దుబ్బాక ప్రజలు దిమ్మ తిరిగేలా చేశారని, ఇప్పుడు కూడ సేమ్ రిపీట్ అవుతుందన్నారు. సిద్దిపేట కోమటిచెరువుకు పెట్టిన నిధుల్లో కనీసం సగమన్నా దుబ్బాకకు ఇచ్చావా అని ప్రశ్నించారు.

ప్రశ్నించే గొంతుకకే దుబ్బాక ప్రజల పట్టం

బీఆర్‌ఎస్ ప్రభుత్వ అహంకారపూరిత పాలనపై ఎదురొడ్డి పోరాడుతున్న తనను దుబ్బాక ప్రజలు గుండెల్లో పెట్టుకొని గెలిపించుకుంటారన్నారు. గత ఉపఎన్నికల్లోనే ఎన్నో కుట్రలు, కుతంత్రాలను తిప్పిగొట్టారని, ఈ ప్రాంత ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా అసెంబ్లీలో సమస్యలు వినిపించి అనేక అభివృద్ధి పనులు పూర్తి చేయించానన్నారు. తనతోనే దుబ్బాకలో కొత్త బస్టాండ్ నిర్మాణం, వంద పడకల ఆస్పత్రి, ఐటీఐ భవనం, ఐఓసీ కార్యాలయంతో పాటు అనేక అభివృద్ధి పనులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. దుబ్బాక–ముస్తాబాద్ డబుల్ రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం నిధులు రూ.12.5 కోట్లు మంజూరి చేయించానని, ఎల్కతుర్తి టూ సిద్దిపేట–దుబ్బాక మండలం నుంచి మెదక్‌కు జాతీయ రహదారి నిర్మాణం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతుందన్నారు. కేంద్రం నిధులు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తామే చేస్తున్నామంటు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు.


చిన్నమాసాన్‌పల్లిలో రఘునందన్‌రావుకు ఘనస్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రభాకర్‌రెడ్డి ఏం చేసిండు?

రెండు సార్లు ఎంపీగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక నియోజకవర్గంకు ఏం చేసిండో చెప్పాలని రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఎంపీ నిధులను దుబ్బాకకు ఇవ్వకుండా గజ్వేల్, సిద్దిపేట, పటాన్‌చెరువుకే కేటాయించారన్నారు.

రాబందులను పాతర పెట్టాలి

రాయపోలు(దుబ్బాక): తెలంగాణను కేసీఆర్ దొర జాగీరుగా మార్చుకున్నాడని రఘునందన్‌రావు ఆరోపించారు. మండలంలోని మంతూరు, చిన్న మాసాన్‌పల్లి, గజ్వేల్ మండలం చిన్న ఆరెపల్లిలలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కనీసం రేషన్ కార్డు ఇవ్వడం చేతకాని సీఎం కేసీఆర్ కుటుంబం రాబందుల్లా తెలంగాణపై పడి దోచుకుతింటున్నారని తీవ్రంగా విమర్శించారు.రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటయితే కేసీఆర్ తిన్నదంతా కక్కిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు మంకిడి స్వామి, వెంకటేశ్‌గౌడ్, స్వామి, నర్సింలు, సత్యపాల్‌రెడ్డి, తిరుపతి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సోమ్లా తండాలో ప్రచారం

చేగుంట(తూప్రాన్): మండలంలోని సోమ్లా తండాలో గురువారం రఘునందన్‌రావును గెలిపించాలని గిరిజన యువ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సుభాష్‌నాయక్, దేవ్లా, సుధాకర్‌నాయక్ ఉన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కాసులాబాద్‌లో గురువారం బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య తోపులాట చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల ఎన్నికల ప్రచారం చేస్తున్న మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి కత్తిపోటుకు గురై చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తనయుడు కొత్త పృథ్వీ కృష్ణారెడ్డి తన తండ్రికి మద్దతుగా కాసులాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌తో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా.. రఘునందన్‌రావు దుబ్బాకకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఈ సందర్భంగా ఫారూఖ్ హుస్సేన్ ఘాటుగా విమర్శలు చేశారు. దీంతో అక్కడే ఉన్న బీజేపీ కార్యకర్తలు రఘునందన్‌రావుకు అనుకూలంగా నినాదాలు హోరెత్తించారు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఏనాడూ తమ గ్రామాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మధ్య తీవ్ర వాగ్యుద్ధం నెలకొంది.

రామాయంపేట(మెదక్): నర్సంపల్లి రైతుల భూములకు సంబంధించి పట్టా సర్టిఫికెట్లు, పాసుబుక్కులు ఇప్పిస్తామని రఘునందన్‌రావు హామీ ఇచ్చారు. గురువారం రాత్రి నార్సింగి మండలం నర్సంపల్లి, పెద్ద తండా, వల్భాపూర్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి సమస్యల గురించి ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు.


నర్సంపల్లిలో మాట్లాడుతున్న దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు


సోమ్లాతండాలో ప్రచారం చేస్తున్న బీజేపీ యూత్ నాయకులు